సాక్షి
జోగులాంబ గద్వాల

బుధవారం। 26। ఫిబ్రవరి। 2025



శివరాత్రి ఉత్సవాలు

అలంపూర్ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸



చెంచుల జాతర

నల్లమల అటవీ ప్రాంతంలోని భౌరాపూర్‌లో చెంచుల పండుగ ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.1/16.2

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉదయం, రాత్రివేళ చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోండి

గద్వాలటౌన్ : అనధికార ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులైజేషన్ (ఎల్‌ఆర్‌ఎస్) పథకాన్ని ప్రకటించిందని, తాజాగా దీనిపై ఫీజులో 25 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ దశరథ్ తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో 2020 ఆగస్టు 26వ తేదీ వరకు రిజిస్టర్ అయిన అనధికార ప్లాట్లు, లేఅవుట్లను మాత్రమే క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చిందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ఇప్పటికే ఫీజు వివరాలను ఫోన్‌ద్వారా మెసెజ్ పంపడం జరిగిందన్నారు. ఫోన్‌కు మెస్సెజ్ రాని వారు ఫీజు వివరాలను మున్సిపాలిటీకి వచ్చి తెలుసుకోవాలని సూచించారు. మార్చి 31వ తేదీలోపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్రమబద్ధీకరించుకోవాలని, వారికే ఫీజులో 25 శాతం రాయితీ లభిస్తుందని చెప్పారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



అయిజ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయాన్ని జిల్లా వ్యవసాయ అధికారి పరిశీలించారు. రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలపై వచ్చిన వినతిపత్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. అనంతరం సింగిల్ విండో గోదాంను సందర్శించారు. స్టాక్ రిజిస్టర్‌ను, గోదాంలోని నిల్వలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఫర్టిలైజర్స్‌ను నిల్వ చేసుకోవాలని పీఏసీఎస్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జనార్ధన్, ఏఈఓలు పాల్గొన్నారు.

'చెరుకు' బకాయిలు చెల్లించండి



అమరచింత: చెరుకు రైతులకు వెంటనే బకాయి డబ్బులు చెల్లించాలని చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ డీజీఎం మురళికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. 2010–11 సంవత్సరం నుంచి రైతులు చెరుగు సాగు చేయడం ప్రారంభించారని తెలిపారు. మొదట్లో డ్రిప్, విత్తనాలు రాయితీపై అందించడమేగాక పెట్టుబడి సాయం ఇచ్చారని.. ఇప్పుడు అన్నీ ఎత్తివేసి మద్దతు ధర కూడా ఇవ్వకుండానే పంట కోతలు చేపడుతున్నారని వివరించారు. పంట కోతలు జరిగి 40 రోజులవుతున్నా నేటికీ డబ్బులు చెల్లించడం లేదని వివరించారు. 15 రోజుల్లో డబ్బులు చెల్లించకుంటే 16 శాతం వడ్డీతో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్, నాయకులు అరుణ్, వెంకట్రాములు, వెంకటేశ్వర్లు, శివలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తోడేస్తున్నారు..!

తుంగభద్ర నదిపై ఏపీకి చెందిన ఇసుకాసురుల పంజా



తూర్పు గార్లపాడు వద్ద సరిహద్దును పరిశీలించేందుకు వెళ్తున్న జిల్లా అధికారులు (ఫైల్)

- రాష్ట్ర సరిహద్దులోకి వచ్చి మరబోట్లతో తోడివేత
- ఉచితం పేరుతో వందల లారీలు తరలిస్తున్న వైనం
- అనుమతులున్నా.. జిల్లా వాసులకు దక్కని ఇసుక

రాజోళి: తుంగభద్ర నదిని అడ్డాగా చేసుకొని ఏపీకి చెందిన ఇసుకాసురులు ఇసుకను లారీలకు లారీలు తోడేస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలోకి వచ్చి మరీ.. మరబోట్ల సాయంతో ఇసుక తోడివేత నిర్వహిస్తున్నారు. సరిహద్దు చొచ్చుకొని ఇవతలికి వచ్చి.. రాత్రింబవళ్లు ఇసుక తవ్వుతున్నా.. అడిగే జిల్లా అధికారులే లేకుండా పోయారు. ఇదే అలుసుగా ఏపీకి చెందిన ఇసుక వ్యాపారులు తుంగభద్ర నది ప్రవాహం ఉన్న సరిహద్దు గ్రామాలు అన్నింట్లో ఇసుక తవ్వేస్తున్నారు. ఇలా తవ్వుతూపోతే భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో నాయకులు, అధికారులు తెలుసుకుని వాటికి అడ్డుకట్ట వేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

రెండు ప్రాంతాల నడుమ..

తుంగభద్ర నది రెండు ప్రాంతాల నడుమ ప్రవహిస్తుంది. అటు ఏపీలోని కర్నూల్ జిల్లా, ఇటు గద్వాల జిల్లాల నడుమ ప్రవహిస్తుండగా.. ఇరు ఆ ప్రాంతాల వారు ఇవే నీటితో పంటలు పండిస్తున్నారు. కానీ ఇసుక విషయంలో మాత్రం విభేదాలు తలెత్తుతున్నాయి. గతంలో ఇలాంటి సమస్య లేకపోయినా, ప్రస్తుతం తుంగభద్ర నదిలో ఇసుక తీసే విషయంలో తరుచూ సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. ఇదిలాఉండగా, జిల్లాలో ఉన్న నదుల్లో తుంగభద్ర ఒకటి. కాగా ఇసుక తీసుకునేందుకు జిల్లా అవసరాలకు, ప్రభుత్వ ఆదాయానికి కూడా ఇది వనరు. కాగా.. మన ఇసుక వాహనాల ద్వారా జిల్లాలోని ఇసుక అవసరాలకు అనుమతి ఉంది. అయితే దీని ద్వారా ఆన్‌లైన్‌లో చలాన్లు చెల్లించి ఇసుక అవసరమున్న వారు బుక్ చేసుకుంటున్నారు. దీని వల్ల ప్రభుత్వానికి కూడా ఆదాయమే. కానీ అనుమతి ఉన్న వాహనాలు నదిలోకి ఇసుక కోసం వెళ్తే ఏపీ అధికారులు మా సరిహద్దులోకి వచ్చారంటూ.. జరిమానాలు విధిస్తున్నారు. కానీ ఏపీకి చెందిన వాహనాలు ఇటువైపు వచ్చినా ఇక్కడి అధికారులు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరం. దీనిపై దృష్టి పెట్టాల్సింది పోయి, ఇసుక పక్కదారి పడితే కేసులు తప్పవని, ఉక్కు పాదం మోపాలని సాక్ష్యాత్తు సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని జిల్లా వాసులు అంటున్నారు. ఏపీ అధికారులు కేసులు నమోదు చేస్తుంటే జిల్లా అధికారులు కేవలం సరిహద్దు పరిశీలనతో సరిపెట్టారని అంటున్నారు.

కదలిక లేని హద్దుల గుర్తింపు

జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న వారికి ఇసుకను అందించే వాహనాలను సైతం నదిలోకి ఏపీ అధికారులు రానివ్వడం లేదని ట్రాక్టర్ల యజమానులు చేసిన విజ్ఞప్తి మేరకు గద్వాల జిల్లా అధికారులు గత డిసెంబర్ నెలలో రాజోళి మండంలోని తూర్పు గార్లపాడు నుండి నది మధ్యలోకి వెళ్లి హద్దులను పరిశీలించారు. సర్వేయర్ మ్యాప్ ద్వారా జిల్లా హద్దు ఎక్కడి వరకు వస్తుందో సాధారణ అంచనా వేశారు. ఏపీ అధికారులతో మాట్లాడి ఉమ్మడి సర్వే చేస్తామని అన్నారు. కానీ నేటి వరకు దానిపై ఎలాంటి కదలిక రాలేదు. అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ నుండి అలంపూర్ దాకా తుంగభద్ర నది ప్రవహిస్తుంది. నది ఇటు వైపు జిల్లాలోని గ్రామాలు కాగా..నది అవతలి వైపు కర్నూల్ జిల్లాలోని గ్రామాలు. ఈ నేపథ్యంలో ఏపీలో ఉన్న ఉచిత ఇసుక పథకం పేరుతో ఇసుక అక్రమంగా పక్కదారి పడుతందని ఆరోపణలు ఉన్నాయి. కేటాయించిన ఇసుక రీచ్‌లను కాదని నదిలో ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు జరుగుతున్నాయని, ఆ క్రమంలోనే నది ఇటువైపునకు కూడా వస్తున్నారని జిల్లా వాసుల ఆందోళన.

మరబోట్లతో తవ్వకాలు

తుమ్మిళ్ల దగ్గర ప్రతి రోజూ మరబోట్ల ద్వారా వచ్చి లారీల కొద్దీ ఇసుకను తవ్వేస్తున్నారు. దీనిపై ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా చర్యలు లేవు. ఉచితం పేరుతో ఏపీ వారు వారి దగ్గర, జిల్లా సరిహద్దులో ఉన్న ఇసుక మొత్తం ఖాళీ చేస్తుంటే ప్రభుత్వానికి ఆదాయం ఎలా వస్తుంది, ప్రజల అవసరాలు ఎలా తీరతాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏపీ అధికారులతో మాట్లాడి హద్దు నిర్ణయించడం మానేసి,వారి వాహనాలను ఇవతలి హద్దులోకి వచ్చినా వదిలేస్తే దాని వల్ల ప్రభుత్వాదాయానికి గండి మాత్రమే ఉంటుందని అంటున్నారు. ఇకనైనా జిల్లా అవసరాలు, ప్రభుత్వ ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ఈ ఇసుక దోపిడీపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రాజోళి మండలం తుమ్మిళ్ల గ్రామ శివారులో మరబోటు సాయంతో ఇసుక తోడివేత

చర్యలు తీసుకుంటాం

ఏపీలోని వాహనాలు జిల్లా సరిహద్దుల వరకు వచ్చి అక్రమంగా ఇసుకను తీస్తున్నారని తెలిసింది. మైనింగ్ అధికారులతో మాట్లాడి ఆ వాహనాలపై ప్రత్యేక నిఘా పెడతాం. హద్దు సమస్య గురించి కూడా పైఅధికారులతో చర్చిస్తాం. అవతలి వాహనాలు ఇటు వైపు రాకుండా చూసేందుకు వెంటనే చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్‌రావు, ఆర్డీఓ, గద్వాల

సన్నగిల్లుతున్న ఆశలు

నాలుగు రోజులైనా దొరకని ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ



టన్నెల్ లోపల భారీగా పేరుకుపోయిన బురద మట్టి, శిథిలాలు

- ఘటనా స్థలానికి కొద్దిదూరంలోనే ఆగిపోతున్న రెస్క్యూ బృందాలు
- భారీగా వస్తున్న నీటి ఊటతో తీవ్ర ఆటంకం
- టన్నెల్ లోపలికి వెళ్లిన ర్యాట్ హోల్ మైనర్స్
- దేవుడిపైనే భారమంటున్న కుటుంబ సభ్యులు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మందికార్మికులను కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఈ నెల 22న ఘటన జరగగా ఇప్పటి వరకు వారి ఆచూకీ లభ్యం కాలేదు. దాదాపు 11 రెస్క్యూ బృందాలు నాలుగు రోజులుగా రేయింబవళ్లు శ్రమిస్తున్నా కనీసం ఘటనా స్థలానికి చేరుకోలేకపోతున్నారు. మంగళవారం నాలుగో రోజు కూడా సహాయక చర్యల్లో ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో బాధిత కుటుంబాల్లో నిరాశ, నిస్పృహ అలుముకోగా.. ఆశలు సన్నగిల్లుతున్నాయి.

సహాయక చర్యలకు ఆటంకం..

సొరంగంలో సెగ్మెంట్ బిగిస్తుండగా ఏర్పడిన రంధ్రం వల్ల నీటి ప్రవాహం రోజురోజుకూ పెరుగుతుండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మందిని కాపాడేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం లేకపోయింది. బురద, నీటి ప్రవాహంతో సహాయక బృందాలు ముందుకు వెళ్లలేకపోతున్నాయి. ఇప్పటికే ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఆర్మీ తదితర 11 బృందాలకు చెందిన 750 మంది నిపుణులు కార్మికుల ఆచూకీ కోసం గాలిస్తుండగా.. బుధవారం మరిన్ని బృందాలు రంగంలోకి రానున్నాయి. చెల్లాచెదురైన మిషన్ వద్దకు చేరుకునేందుకు ర్యాట్ హోల్ మైనర్స్ కూడా ప్రయత్నిస్తున్నారు. నిమిషానికి 3,600 నుంచి 5 వేల లీటర్ల నీటి ఊట వస్తుండటంతో రెండు 100 హెచ్‌పీ మోటార్లతో నీటిని బయటికి తోడేస్తున్నా ఊట అదుపులోకి రాలేకపోతోంది. రేపటి వరకు నీటి ప్రవాహం తగ్గుతుందనే ఆశాభావం మంత్రుల బృందం వ్యక్తం చేస్తోంది. సహాయక చర్యలు ముమ్మరం చేసేందుకు ఎల్ అండ్‌టీ సంస్థ రెండు క్రేన్‌లను కూడా తెప్పించింది. వాటిని లోపలికి తీసుకెళ్లి పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉంచారు. మరోవైపు పైకప్పు కూలిన ఘటనతో కార్మికుల్లో నెలకొన్న భయం ఇంకా తొలగిపోలేదు. మంగళవారం పనులు చేయడానికి ముందుకు రాకపోవడంతో పలు దఫాలుగా వారితో చర్చలు జరిపి లోపలికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఉదయం 8 గంటల షిఫ్టులో వెళ్లాల్సిన బృందం మధ్యాహ్నం ఒంటి గంటకు లోపలికి వెళ్లింది.

నీరు, మట్టి తొలగిస్తేనే..

టన్నెల్‌లో కాంక్రీట్ సెగ్మెంట్లతోపాటు నిర్మాణ సామగ్రి, సెగ్మెంట్ మిషన్, ఇతర సామగ్రి, కన్వేయర్ బెల్ట్, లోకో ట్రైన్ ట్రాక్ వంటివి నీటిలో మునిగి, మట్టిలో కూరుకుపోయాయి. ఈ క్రమంలోనే సెగ్మెంట్ల కింద కానీ, బురదలో కాని బాధితులు చిక్కుకుని ఉంటారని, తొలగింపు ఎంతో జాగ్రత్తగా చేయాల్సి ఉంటుందని రెస్క్యూ బృందాలు పేర్కొంటున్నాయి. శిథిలాలను తొలగించేందుకు వచ్చిన బృందాలు తాళ్లు, పలుగు, పారలతో లోపలికి వెళ్లారు. నీరు, మట్టిని తొలిగిస్తే తప్ప ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. శిథిలాలు తొలగిస్తుంటే ఎక్కడి నుంచి ఏ సమస్య వస్తుందోనన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

నిత్యం సమీక్షలు

సొరంగ ప్రమాదం నేపథ్యంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ నాలుగు రోజులుగా సమీక్షలు నిర్వహిస్తూ.. వివిధ దేశాలకు చెందిన నిపుణులను రప్పించి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. అయితే ప్రజాప్రతినిధుల రాకతో వారి భద్రతా ఏర్పాట్లు, అధికారుల హడావుడితో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోందన్న వాదన వినిపిస్తోంది.



సొరంగంలోకి వెళ్లేందుకు సామగ్రి సిద్ధం చేసుకుంటున్న ర్యాట్ హోల్ మైనర్స్



స్నిపర్ డాగ్‌తో సొరంగంలోకి వెళ్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

పొట్ట కూటి కోసం వచ్చి..

పొట్ట కూటి కోసం వేలాది కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనుల్లో చిక్కుకున్నారు. వారి ప్రాణాలు ఇప్పుడు దేవుడిపైనే భారంగా మారింది. జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, జమ్ముకాశ్మీర్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు జేపీ కంపెనీలో పనిచేస్తున్నారు. చాలీచాలనీ వేతనాలు, కూలీలకు ప్రాణాలను పణంగా పెట్టి ప్రమాదకర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. తమకు సొంత ప్రాంతంలో పని లేకనే ఇంత దూరం వచ్చి పనిచేస్తున్నామని, తమ వారి ప్రాణాలకు భద్రత లేదని వాపోతున్నారు. కూలీ డబ్బులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని, ఇక్కడ పనిచేస్తున్నారనే పేరు తప్పా తామే తిండికి డబ్బులు పంపిస్తున్నామని ఆరోపించారు. ఈ క్రమంలోనే మంగళవారం జార్ఖండ్ రాష్ట్రం గుమ్లా జిల్లాకు చెందిన నాలుగు కుటుంబాల సభ్యులు ఎస్‌ఎల్‌బీసీ సొరంగం వద్దకు చేరుకున్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి తమ కుటుంబ సభ్యులను క్షేమంగా తీసుకువచ్చి అప్పగించాలని అధికారులను కోరుతున్నారు.

పారదర్శకంగా ఉపాధి హామీ పనులు

- గ్రామాల అభివృద్ధికి నిధులు వినియోగించుకోవాలి
- కలెక్టర్ బీఎం సంతోష్

ఎర్రవల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను నిర్దేశించిన లక్ష్యాల మేరకు పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి కలెక్టర్ సందర్శించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వాటిని సమర్థవంతంగా ఉపయోగించి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడాలని అన్నారు. గ్రామ పంచాయతీలలో ఎన్‌ఆర్ ఈజీఎస్ పథకం క్రింద మంజూరైన పనులకు సంబంధించి ఎస్టిమేషన్ విధానం, పనుల అమలు, చెల్లింపు వివరాలను సమీక్షించి అన్ని వివరాలు ఖచ్చితంగా ఉండాలని ఆదేశించారు. మండలంలో ఇప్పటి వరకు హరితహారం కింద నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కల వివరాలు, వాటి నిర్వహణకు జరిగిన ఖర్చులను సమీక్షించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద అవసరమైన మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ నిధుల్లో 60శాతం వ్యవసాయ అనుబంధ పనులకు కేటాయించాలన్నారు. మెజర్‌మెంట్ బుక్, మస్టర్‌రోల్‌ను పరిశీలించి, అన్ని రిజిస్టర్లు స్పష్టంగా నిబంధనలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ కింద చేపట్టిన అన్ని పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పనుల పురోగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు ఎంపీడీఓ కార్యాలయంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపుదల కోసం రూ.30 వేలతో నిర్మిస్తున్న ఇంకుడు గుంత పనులను పరిశీలించి పనుల నాణ్యతపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, ఎపీఓ శివజ్యోతి, టీఏలు కృష్ణయ్య, లావణ్య, హుస్సేన్ పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో నిర్మించిన ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

మహా శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన తెలుగుపేట శివాలయం

గద్వాలటౌన్: జిల్లాలో అన్ని శైవక్షేత్రాలు బుధవారం రోజు హర హర శంభో శంకర.. ఓం నమః శివాయస్మరణలతో మారుమోగనున్నాయి. ఇప్పటికే శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఉపవాసాలకు సిద్ధమయ్యారు. దీంతోపాటు రాత్రంతా జాగరణ చేస్తారు. శివరాత్రి పండగ రోజున ఆలయాలకు వెళ్లి శివలింగాలకు అభిషేకం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శివాలయాలతో పాటు గ్రామాలలో ఉన్న శైవక్షేత్రాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. తెలుగుపేట కాలనీలలోని శివాలయాలతో పాటు వీరభద్రస్వామి, కన్యకాపరమేశ్వరి, నందీశ్వర, భీమలింగేశ్వర ఆలయాలలో తెల్లవారుజాము నుంచే శివునికి రుద్రాభిషేకం, బిల్వపత్ర పూజ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నదిఅగ్రహారంలోని స్ఫటిక లింగం పూజలకు ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. నల్లకుంట కాలనీలోని శివాలయంలో రాత్రి పది గంటలకు లింగోద్భవ అభిషేకం నిర్వహించనున్నారు.

నేడు పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం..

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నల్లకుంట శివాలయం, పాండురంగ శివాలయంతో పాటు పలు శివాలయాలల్లో 26వ తేదీ పార్వతీ, పరమేశ్వరుల కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పలుచోట్ల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాలను నిర్వహిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలపై సమగ్ర విచారణ చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ఆయా కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని.. సదరు ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేదా కుట్రపూరితంగా హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించారనే కోణంలో సమగ్రంగా విచారణ చేయాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమస్యలపై వచ్చే బాధితులకు న్యాయం అందేలా చూడాలని, ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ, ప్రైవేటు భూములు కబ్జాకు పాల్పడినట్లు వచ్చే ఫిర్యాదులపై శాంతిభద్రత సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు, అనుమానాస్పద కేసులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సంయుక్తంగా పని చేయాలన్నారు. అనుమతి లేకుండా ఇసుక, మట్టి తరలించినా.. అక్రమంగా రేషన్ బియ్యం, నిషేధిత మత్తు పదార్థాలు, గంజాయి, పేకాట వంటిని రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో సిబ్బంది ఎవరైన ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసిన అనర్హత వేటు తప్పదన్నారు. నమోదైన కేసుల విషయంలో నిర్లక్ష్యం లేకుండా వీలైనంత త్వరగా కోర్టులో చార్జీషీట్ దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయా స్టేషన్‌లో నమోదైన కేసులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఎస్పీ మొగిలయ్య, సీఐ టాటాబాబు, శ్రీను, రవిబాబు, ఎస్‌ఐలు, కళ్యాణ్‌కుమార్, శ్రీకాంత్, వేంకటేష్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

2న వనపర్తికి ముఖ్యమంత్రి రాక



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అభివృద్ధి పనుల నివేదికను అందజేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.. చిత్రంలో ఎంపీ మల్లు రవి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు

వనపర్తి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్చి 2న వనపర్తి జిల్లాకు రానున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీ మల్లు రవి, నేతలతో కలిసి హైదరాబాద్‌లో అభివృద్ధి పనుల నివేదికను సీఎంకు ఆయన అందజేశారు. సుమారు రూ.వెయ్యి కోట్ల పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. మంగళవారం కలెక్టర్ ఆదర్శ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, యాదయ్య సమావేశమై సీఎం పర్యటన ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. సాయంత్రం కలెక్టరేట్ సమీపంలోని హెలీప్యాడ్‌ను ఎస్పీ పరిశీలించి బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల పార్కింగ్ తదితర వాటిపై డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ కృష్ణకు సూచనలు చేశారు.

అభివృద్ధి పనులు ఇలా..

జిల్లా జనరల్ ఆస్పత్రిని 500 పడకలకు పెంచడం, ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల భవనం, ఇంటర్మీడియట్ కళాశాల, షాపింగ్ కాంప్లెక్స్, ఇందిరమ్మ ఇళ్ల పథకం, పెబ్బేరులో 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. సీఎం జిల్లాకు వచ్చే నాటికి పనుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. జిల్లా పర్యటనలో తన చిన్ననాటి స్నేహితులతో కొంత సమయం గడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

సంపులో పడి వ్యక్తి మృతి

తెలకపల్లి: నీటి సంపుగుంతలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్ వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన ఇరుగజీవి కరుణాకర్ (35) ఈ నెల 24న సాయంత్రం గ్రామ శివారులో తన పొలంలో మొక్కజొన్న పంటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. సంపులోని నీటిని మోటార్ ద్వారా పొలానికి పారించే క్రమంలో పైప్ ఊడిపోయి నీటిలో పడింది. పైప్‌ను బైటకు తీసే క్రమంలో ప్రమాద వశాత్తు సంపునీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మృతి చెందాడు. అతని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపల వేటకెళ్లి మరొకరు..

మక్తల్: చేపల వేటకెళ్లి ఓ వ్యక్తి చెరువులో పడి మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలోని దాసర్‌దొడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన లింగప్ప(45) అనే వ్యక్తి ఉదయం గ్రామ శివారులో ఉన్న బాపనోనిచెరువుల్లో చేపలు పడుతున్నాడు. అదుపు తప్పి చెరువులో పడి మృతిచెందాడు. మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్..


తిరుమలేష్ (ఫైల్)

అయిజ: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్ మృతి చెందినట్లు విద్యుత్ ఏఈ నరేందర్ రెడ్డి తెలిపారు. వివరాలు.. మండలంలోని ఎక్లాస్‌పురం గ్రామంలో మంగళవారం జూనియర్ లైన్‌మెన్ కె.కురువ తిరుమలేష్ (35) ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేసే క్రమంలో ఎల్‌సీ తీసుకొని ఫీజులు తొలగించాడు. అనంతరం ఎల్‌సీని రిటన్ చేసి మిగిలిన పనిచేస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరా కావడంతో తిరుమలేష్ కిందపడిపోయాడు. కొన్ని నిమిషాల్లోనే మృతిచెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కోస్గి రూరల్: పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సర్జఖాన్‌పేట్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన పాతుర్ల ఇసుమప్ప(40) మద్యానికి బానిసై భార్య భీమమ్మతో తరచూ గొడవ పడేవాడు. సోమవారం మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన ఇసుమప్ప బయటికి వెళ్లి పురుగుమందు తాగి ఇంటికొచ్చాడు. గుర్తించిన భార్య ప్రైవేట్ వాహనంలో కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి మహబూబ్‌నగర్‌కు తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పారిశుద్ధ్య కార్మికురాలు..

నవాబుపేట: మండలంలోని గురుకుంటకు చెందిన పంచాయతీ కార్మికురాలు బ్యాగరి చెన్నమ్మ (62) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఈ నెల 14న గ్రామ వీధులను శుభ్రం చేసి చెత్త కుప్పకు నిప్పంటించగా ప్రమాదవశాత్తు చీర అంటుకొంది. గమనించిన స్థానికులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కార్మికురాలి అంత్యక్రియలకు పంచాయతీ నుంచి రూ.పది వేలు అందజేశారు. కుమారుడు బ్యాగరి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

మృతదేహం గుర్తింపు

నాగర్‌కర్నూల్ క్రైం: కేసరి సముద్రం చెరువులో లభించిన మృతదేహం గోపాల్‌పేటకు చెందిన చంద్రమ్మ (37)గా గుర్తించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. ఈమె చాలాకాలంగా కడుపునొప్పితో బాధపడుతుందని.. ఈ నెల 23న జిల్లాకేంద్రంలో ఉండే తల్లిగారింటికి వెళ్తున్నట్లు భర్త కృష్ణయ్యకు చెప్పి వచ్చి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో మృతురాలి ఫొటోను గుర్తించిన కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారని.. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం


గోమాతతో ఆలయ ప్రదక్షిణ

తొలిరోజు అలంపూర్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర క్షేత్రంలో మహా శివరాత్రి వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు స్వామి, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి ధ్వజ మండపం వద్ద గోమాతకు పూజలు, అమ్మవారికి మంగళ ద్రవ్యాలు, పట్టువస్త్రాలు అందజేశారు. అనంతరం యాగశాల ప్రవేశం చేసి శివసంకల్పం పఠించి బలిహరణం, త్రిశూల పూజలు చేశారు. యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహ వాచనం, కంకణధారణ, రుత్విక్ వరణం తదితర పూజలు జరిగాయి. బాలబ్రహ్మేశ్వర ఉద్యానవనంలో పుట్టమన్ను తీసుకొచ్చి ఆలయ ప్రదక్షిణలు, ఆలయ ఈఓ యాగశాలకు మత్తికను తీసుకొచ్చారు. అక్కడ పాలికల్లో పుట్టమన్ను నింపి పాలల్లో తడిపిన నవ ధాన్యాలను మట్టిలో మిళితం చేశారు. అర్చకులు మంత్ర పూర్వక జలాన్ని అభిమంత్రిస్తూ క్షేమాన్ని కోరుతూ పూజలు చేశారు. యాగశాలలో అగ్ని ప్రతిష్ఠాపనతో దేవత హోమాలు ప్రారంభించారు.


ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న కిట్టుస్వామి

ఘనంగా ధ్వజారోహణం..

బాలబ్రహ్మేశ్వరుడి ఆలయంలో రాత్రి ధ్వజారోహణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే భక్తులతో కలిసి ధ్వజారోహణం చేశారు.

భారీ బందోబస్తు..

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ రవిబాబు తెలిపారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ మొగులయ్య ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, 200 సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు. వీరితోపాటు మహిళా పోలీసులు, షీటీంలు, మఫ్టీలో పోలీసులు విధులు నిర్వర్తిస్తారని చెప్పారు. ఎస్‌ఐ వెంకటస్వామి పాల్గొన్నారు.

నల్లమలలో చెంచుల జాతర

- నేడు భౌరాపూర్‌లో భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం
- వివిధ జిల్లాల నుంచి చెంచుల రాక
- మూడు రోజులపాటు పులకించనున్న అడవి తల్లి


భౌరాపూర్ దేవాలయం

అచ్చంపేట: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నల్లమల అటవీ ప్రాంతంలోని భౌరాపూర్ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో చెంచుల పండుగ మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. ఇప్పటికే కలెక్టర్ బదావత్ సంతోష్ సంబంధిత అధికారులతో కలిసి భౌరాపూర్ దేవాలయాన్ని సందర్శించి.. భక్తులకు సౌకర్యాల కల్పనపై పలు సూచనలు చేశారు. పురాతన ఆలయంలో కొలువుదీరిన భ్రమరాంబిక, మల్లికార్జునస్వామికి మహా శివరాత్రి రోజున శ్రీశైలంలో జరిగే ఉత్సవాల తరహాలోనే ఇక్కడ కూడా కల్యాణం జరిపిస్తారు.

ఆదివాసీ చెంచుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా..

పూర్వం శ్రీశైలం క్షేత్రానికి ఉత్తరద్వారమైన ఉమామహేశ్వరం నుంచి భక్తులు అడవి మార్గంలో భౌరాపూర్ మీదుగా కాలినడకన నడిచి వెళ్లే వారు. అప్పటికే చెంచులు తమ ఆడబిడ్డ అయిన మహాశివుడి సతీమణి భ్రమరాంబికాదేవిని ఇక్కడ కొలుస్తుండేవారు. వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలం వచ్చి పోయే భక్తులు భౌరాపూర్ వద్ద బస చేసి సేద తీరే వారు. ఈ నేపథ్యంలో ఇక్కడి రాజ్యాన్ని పాలించిన రెడ్డి రాజులు, చాళుక్యులు, ఇక్ష్వాకుల కాలంలో భౌరాపూర్ చెరువు వద్ద భ్రమరాంబికాదేవి ఆలయం నిర్మించారు. ఆలయానికి ఎదురుగా చెరువు కట్టపై వీరభద్రుడు, మూడు కిలో మీటర్ల దూరంలో నైరుతి వైపున వంటి వీరన్న (వీరభద్రుడు) వెలిశారు. దీంతో ఆ ప్రాంతమంతా పుణ్యక్షేత్రంగా మారింది. ఆలయ నిర్మాణంతో మహాశివరాత్రి రోజున శ్రీశైలంలో జరిగే ఉత్సవాల తరహాలోనే ఇక్కడ జాతరను చెంచులు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. భౌరాపూర్ ఉత్సవాలు ఆదివాసీ చెంచుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయి. 2016 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలను నిర్వహిస్తోంది.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు

భౌరాపూర్ ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. అమ్రాబాద్ మండలం మన్ననూర్ నుంచి 15 కి.మీ. దూరంలోని ఫర్హాబాద్ చౌరస్తా వద్ద అటవీశాఖ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు ప్రధాన రహదారి నుంచి 15 కి.మీ. అటవీ ప్రాంతంలో ప్రయాణించాలి. ఉత్సవాల నిర్వాహకులు, అధికారులు జాతరకు వెళ్లేమార్గాన్ని సూచిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. అప్పాపూర్ పంచాయతీ పరిధిలో ఉండటంతో ప్రత్యేకాధికారి, కార్యదర్శి, ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కార్యక్రమాలు ఇలా..

ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు స్వాగతోపన్యాసం కార్యక్రమాలు, 4 నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు చెంచుల సంస్కృతి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చెంచుల ఆటపాట, శివనామస్మరణ, జాగరణ, సంప్రదాయ నృత్యాలతో జాతర వైభవంగా ప్రారంభమైంది. బుధవారం వేదపండితులతో గణపతిపూజ, రుద్రహోమం, అభిషేకం, అంకురార్పణ అనంతరం 11గంటలకు భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. గురువారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, జాతర ముగింపు కార్యక్రమాలు ఉంటాయి. నల్లమల చెంచులతో పాటు నల్లగొండ, రంగారెడ్డి, వికారాబాద్, ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా చెంచులు అధిక సంఖ్యలో తరలివస్తారు.


లింగాల మండలం శాయినిపేట నుంచి ప్రత్యేక బస్సులో భౌరాపూర్ తరలివెళ్తున్న చెంచులు

తాళం వేసిన ఇళ్లల్లో చోరీలు


గద్వాలలో బాధితులతో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

జడ్చర్ల టౌన్/గద్వాల క్రైం/మక్తల్: తాళం వేసిన పలు ఇళ్లల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల మున్సిపాలిటీలోని 12వ వార్డు శ్రీనివాస నగర్ కాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగి పెంటోజీ ఆదివారం ఇంటికి తాళంవేసి కుటుంబ సభ్యులతో కలిసి నాగర్‌కర్నూల్‌కు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని సోమవారం సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటి తాళం తీసి ఉండటం.. ఇంట్లో బీరువా తాళం పగులగొట్టి వస్తువులు చిందర వందరగా ఉండటాన్ని గుర్తించారు. బీరువాలో ఉన్న 5.5 తులాల బంగారం ఆభరణాలు, రూ. 3లక్షల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా.. ఆదివారం అర్ధరాత్రి దాటాక దొంగలు ఇంట్లోకి చొరబడినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

- జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సంతోష్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఆనందమ్మ, నాహోర్ వృత్తిరీత్యా ప్రభుత్వ ఉద్యోగులు. రోజువారీ విధుల్లో భాగంగా మంగళవారం ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లడాన్ని గమనించిన గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 5 తులాల బంగారం ఆభరణాలు, రూ. 10వేల నగదును చోరీ చేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ శ్రీను, ఎస్‌ఐ కళ్యాణ్ కుమార్ అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.
- మక్తల్ పట్టణంలో ఓ వృద్ధురాలి వద్ద ఉన్న రెండున్నర తులాల బంగారం గొలుసు, నగదును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశారు. స్థానికుల వివరాల మేరకు.. ఊట్కూర్ మండలం తిప్రాస్‌పల్లికి చెందిన హరిజన్ కిష్టమ్మ మక్తల్‌కు బ్యాంకు పని నిమిత్తం వచ్చింది. అయితే పడమటి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కూర్చున్న కిష్టమ్మ మెడలో ఉన్న బంగారు గొలుసుతో పాటు బస్తాలో ఉన్న రూ. 17వేల నగదును గుర్తుతెలియని దుండగుడు చోరీ చేశాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీసీ ఫుటేజీలను పరిశీలించారు.

ప్రాణం మీదికి తెచ్చిన ఆన్‌లైన్ అప్పు

శాంతినగర్: ఆన్‌లైన్‌లో తీసుకున్న అప్పు ఓ వ్యక్తి ప్రాణం మీదికి తెచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ క్యాతూరు నర్సింహ స్థానికంగా బిర్యానీ సెంటర్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం వ్యక్తిగత అవసరం నిమిత్తం ఆన్‌లైన్‌లో అప్పు తీసుకున్నాడు. ఈ క్రమంలో తీసుకున్న అప్పును తిరిగి చెల్లించాలంటూ సదరు వ్యక్తులు వేధింపులకు గురిచేయడంతో అతడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం సాయంత్రం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే మంటలను ఆర్పివేసి.. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

గంజాయి పట్టివేత

వనపర్తి రూరల్: వనపర్తి జిల్లాకేంద్రంలోని శ్రీనివాసపురం శివారులో ఓ యువకుడు బైక్‌పై వెళ్తుండగా పోలీసులు ఆపి తనిఖీ చేయగా అతని వద్ద 133.3 గ్రాముల గంజాయి దొరికిందని రూరల్ ఎస్‌ఐ జలేందర్ రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. వనపర్తి పట్టణంలోని బ్రహ్మంగారి వీధికి చెందిన పెబ్బేటి పవన్‌కుమార్, పీర్లగుట్టకు చెందిన కండని సాయిప్రకాష్, మరో బాలుడు, వనపర్తి చెందిన బాలును అదుపులోకి తీసుకొని 133.3 గ్రాముల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసి ముగ్గురిని కోర్టులో హాజరుపరిచామని ఎస్‌ఐ తెలిపారు.

కట్ట మైసమ్మ విగ్రహం ధ్వంసంపై ఆందోళన


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

మరికల్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఆనకట్టపై వెలసిన కట్ట మైసమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. అంతకుముందు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, బసంత్, వేణు, అయ్యప్ప, శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మరికల్‌లో కుల మతాలకు అతీతంగా ప్రజలు కలసిమెలిసి జీవిస్తారని.. ఇలాంటి గ్రామంలో కట్ట మైసమ్మ దేవత విగ్రహాన్ని ధ్వంసం చేయడం ఆందోళనకరమైన విషయమన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా, జాతీయ రహదారిపై ఆందోళనతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రాము అక్కడికి చేరుకుని నచ్చజెప్పారు. దుండగులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కట్ట మైసమ్మ ఆలయం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు శేఖర్, రాములు, తిరుపతయ్య, రాజేశ్వర్‌రెడ్డి, రాంరెడ్డి, గోపాల్, కృష్ణయ్య, ఆంజనేయులు, గంగిరెడ్డి, గోపి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

చోరీ కేసులో పాత నేరస్తుడి అరెస్ట్

ఆత్మకూర్: మండల కేంద్రంలో జరిగిన చోరీ కేసులో పట్టుబడిన పాత నేరస్తుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. వివరాలు.. ఈనెల 23వ తేదీన పట్టణంలోని భార్గవినగర్‌లో మణివర్ధన్‌రెడ్డి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో చొరబడి నగదును దోచుకెళ్లిన ఘటనలో బొల్లి కురుమూర్తి అనే పాత నేరస్తుడు పట్టుబడ్డాడు. ఇతడు గతంలో మూడు హత్యలు, పలుచోరీల్లో పట్టుబడి జీవిత ఖైదు శిక్షను అనుభవించాడు. అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. కేసును ఛేదించడంతో ఎస్పీ అభినందిచండంతో పాటు రివార్డును ప్రకటించినట్లు తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్

డ్రంకెన్ డ్రైవ్‌కు సహకరించని వాహనదారుడు

- లాఠీతో బుద్ధి చెప్పిన పోలీసులు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు


ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కుర్వ రాముడు

కేటీదొడ్డి: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వాహనదారుడు పోలీసులకు సహకరించకుండా వారికి ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో సహనం కోల్పోయిన పోలీసులు లాఠీతో బుద్ధి చెప్పారు. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. సుల్తానాపురం గ్రామానికి చెందిన కుర్వ రాముడు ఈనెల 22న రాయచూర్‌కు పని నిమిత్తం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా నందిన్నె చెక్‌పోస్టు వద్ద రాత్రి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో అతడి ఆపి తనిఖీలకు సహకరించాల్సిందిగా సిబ్బంది తెలిపారు. వారితో వాగ్వాదానికి దిగాడు. పోలీసులతో అనుచితంగా వ్యవహరించడంతో పాటు వారి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో ఆగ్రహించిన సిబ్బంది లాఠీతో మందలించి స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ శ్రీనివాసులుతో మాట్లాడి కురువ రాముడిని ఇంటికి తీసుకెళ్లారు. కాగా మంగళవారం ఎస్‌ఐ, సిబ్బందిపై ఎస్పీ శ్రీనివాసరావుకు లిఖితపూర్వకంగా రాముడు ఫిర్యాదు చేశాడు. ఈఘటనపై విచారణ చేయాల్సిందిగా ఎస్పీ గద్వాల సీఐకు ఆదేశించారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌ను ఈ సంఘటనపై 'సాక్షి' వివరణ కోరగా మద్యం మత్తులో రాముడు సిబ్బందితో అనుచితంగా వ్యవహరించినట్లు తెలిపారు. మందలించింది వాస్తవమే కానీ ఉద్దేశపూర్వకంగా చేయలేదని వివరించారు.

తమిళనాడుకు తరలిన పీయూ హ్యాండ్‌బాల్ జట్టు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తమిళనాడు పెరియార్ యూనివర్సిటీలో బుధవారం నుంచి వచ్చే నెల 4 వరకు జరగనున్న పోటీలకు పీయూ సౌత్ జోన్ హ్యాండ్‌బాల్ జట్టు బయలుదేరింది. ఈ సందర్భంగా టీం సభ్యులకు పీయూ వీసీ శ్రీనివాస్ ట్రాక్ సూట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రతిభ కనబర్చి, యూనివర్సిటీకి కప్ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


హ్యాండ్‌బాల్ జట్టుతో పీయూ అధికారులు

యువకుడి దారుణహత్య

జడ్చర్ల: స్థానిక బీఆర్‌రెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్ కాంప్లెక్స్‌లో బిహార్‌లోని కచ్చవా జిల్లా రాంపూర్ భరేతా గ్రామానికి చెందిన రషీద్ ఖాన్ (26) దారుణ హత్యకు గురయ్యాడు. ఫంక్షన్ హాల్ నిర్వాహకులు, పరిసరాల్లోని ఇతర కూలీలు మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ కమలాకర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బిహార్‌కు చెందిన పలువురు కూలీలు అదే ఫంక్షన్‌హాల్‌కు సంబంధించిన కాంప్లెక్స్ గదుల్లో నివాసం ఉంటున్నారు. వీటిలో కొన్ని గదులు ఖాళీగా ఉండగా.. ఓ గదిలోని మరుగుదొడ్డిలో రషీద్‌ఖాన్ మృతదేహాన్ని గుర్తించారు. మరుగుదొడ్డిని అనుసరించి ఉన్న గదిలో రక్తపు మరకలు, మృతదేహం మెడకు గాయం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హతుడు పట్టణ సమీపంలోని ఓ బల్క్‌డ్రగ్ పరిశ్రమలో కూలీగా పని చేస్తున్నట్లు తోటివారు పోలీసులకు వివరించారు. పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

యువకుడిపై కత్తితో దాడి


కత్తిపోట్లకు గురైన క్రాంతికుమార్

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై నిలబడి ఉన్న ఓ వ్యక్తిపై మరో యువకుడు ఆకస్మాత్తుగా వచ్చి కత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్ డబుల్ బెడ్‌రూం ఏరియాలో నివాసం ఉండే క్రాంతికుమార్ చికెన్ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే మహబూబ్‌నగర్‌లోని భగీరథకాలనీ కమాన్ సమీపంలో మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో క్రాంతికుమార్ ఆటో దిగి ఆదర్శనగర్ వైపు వెళ్లడానికి ఎదురుచూస్తున్న క్రమంలో అదే ఏరియాకు చెందిన ఓ యువకుడు అకస్మాత్తుగా వచ్చి అతనిపై కత్తితో కన్నుభాగం, పొత్తి కడుపు, చేతులపై విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. గాయపడిన క్రాంతికుమార్‌ను చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఎస్వీఎస్‌కు తీసుకువెళ్లారు. కత్తితో దాడి చేసిన యువకుడికి క్రాంతికుమార్‌కు పాత పరిచయం ఉండటంతో గతంలో ఏదైనా గొడవ జరిగిందా.. లేక వేరే కారణాలు ఏమైనా ఉన్నాయా.. అనేది తెలియాల్సి ఉంది. ఆస్పత్రి దగ్గరకు చేరుకున్న రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ బాధితుడు క్రాంతికుమార్ నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రాణం తీసిన డీజే జనరేటర్ ఫ్యాన్

ప్రమాదవశాత్తు చీర చుట్టుకొని మహిళ మృతి

ఉప్పునుంతల: పెళ్లి ఊరేగింపులో డీజే జనరేటర్ ఓ మహిళ మృతికి కారణమైంది. డీజేకు అమర్చిన జనరేటర్ ఫ్యాన్‌కు చీర చుట్టుకొని మహిళ మృతిచెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున మండలంలోని ఈరట్వానిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు.. పూర్యానాయక్‌తండాకు చెందిన జరుపుల బుజ్జి(38) అనే మహిళ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఈరట్వానిపల్లిలో తమ బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి వెళ్లింది. రాత్రి పెళ్లి ఊరేగింపు చూస్తుండగా ప్రమాదవశాత్తు డీజేకు అమర్చిన జనరేటర్ ఫ్యాన్‌కు ఆమె చీర చుట్టుకుంది. దీంతో ఆమె తల, మెడతోపాటు ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే వెల్దండ సమీపంలోని యెన్నం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ మలక్‌పేట్ యశోద ఆస్పత్రికి తరలిస్తుండగా మంగళవారం ఉదయం 4 గంటల ప్రాంతంలో చనిపోయింది. ఈమేరకు మృతురాలు భర్త జరుపుల వెంకట్రాం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


జరుపుల బుజ్జి (ఫైల్)